క్లుప్తంగా

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సుకర్లాబాద్, ఇంగ్లిష్ పాలెం, బచ్చుపేట, రామానాయుడుపేట, పరాసుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బలరామునిపేట, నిజాంపేట, ఈడేపల్లి, శక్తిగుడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



పురిటిగడ్డ(చల్లపల్లి): భారతదేశం గర్వించదగ్గ విద్యా సంపన్నుడు అంబేడ్కర్ అని సర్పంచ్ మాతంగి రమ్య అన్నారు. పురిటిగడ్డ ప్రధాన కూడలిలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ రమ్య శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఎస్సీ నేతలు, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

కబడ్డీ జిల్లా జట్టుకు మొవ్వ విద్యార్థిని ఎంపిక



మొవ్వ: స్థానిక మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని జొన్నలగడ్డ నాగ సంజన జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సాంబశివరావు తెలిపారు. కృష్ణా జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన అవనిగడ్డ జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరిగిన జూనియర్స్ బాల బాలికల జిల్లా స్థాయి కబడ్డీ సెలక్షన్స్ పోటీల్లో నాగ సంజన సత్తా చాటి జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. క్రీడాకారిణిని, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల రామారావుని, మండలి మనోహరిని హెచ్ఎం విద్యా కుటుంబం శుక్రవారం అభినందించారు.

కానుకల పంపిణీ

పామర్రు: పామర్రు నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి ఒక్క బ్రాహ్మణ కుటుంబానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సౌజన్యంతో సంక్రాంతి కానుకలను అందజేశారు. పామర్రు మండలంలోని బ్రాహ్మణులకు శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు వీటిని అందజేశారు. పామర్రులోని భేతన బొట్లరాజా తదితర బ్రాహ్మణులకు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, విజయవాడ కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, వార్డు మెంబరు శ్రీహరి పాల్గొన్నారు.
– అడ్డాడలోని ఆలయ అర్చకులకు స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు బలుసు హరికిరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు పామర్తి వెంకటేష్ తదితరులు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అందించిన కానుకలను పంపిణీ చేశారు.

సమర్ధంగా కులగణన

బందరు, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాలో సర్వే ప్రారంభం



కులగణన సర్వేను పరిశీలిస్తున్న బందరు కమిషనర్ చంద్రయ్య



ఘంటసాలపాలెంలో కులగణనపై సూచనలిస్తున్న ఎంపీడీవో

చిలకలపూడి(మచిలీపట్నం): సమర్థంగా కులగణన నిర్వహించాలని మచిలీపట్నం మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నగరంలో శుక్రవారం నుంచి కులగణన సర్వే ప్రారంభమైంది. నగరంలోని ఆయా డివిజన్లలో ఉదయం 9 గంటల నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కులగణన సర్వే నిర్వహించారు. తొలిరోజు నగరంలో 42 డివిజన్లలో సర్వే చేశారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబంలో ఎంత మంది ఉన్నారు. వారు ఏ కులానికి చెందిన వారు వివరాలను సేకరించారు. అనంతరం కుటుంబ పెద్ద, వలంటీర్, సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా యాప్‌లో వివరాలు నమోదు చేశారు. సర్వే జరుగుతున్న తీరును మునిసిపల్ కమిషనర్ జి.చంద్రయ్య 7వ డివిజన్‌లో పరిశీలించారు. వారికి సలహాలు, సూచనలు అందజేశారు.

● **గూడూరు:** ప్రజా సహకారంతో కులగణన జరుగుతుందని ఎంపీపీ మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు సురేష్ రంగబాబు చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం శుక్రవారం గూడూరులో ప్రారంభమైంది. పటాన్‌పేటలో కులగణన ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల నుంచి కులగణన చేయాలని డిమాండ్ ఉందన్నారు. గత ప్రభుత్వాలు ప్రజల డిమాండ్‌ను పెడచెవిన పెట్టాయన్నారు. ప్రజల విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా కులగణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వలంటీరు, సచివాలయ ఉద్యోగి ప్రతి గడపనకు వచ్చి కులగణన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఆ సమయంలో ప్రజలు అందుబాటులో ఉండి పక్కా సమాచారం అందించాలని కోరారు. దీంతో కులగణన పారదర్శకంగా సాగడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. విజయప్రసాద్, ఎంపీడీవో డి.సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు లింగం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **పెడన:** పట్టణంతో పాటు మండలంలో కులగణన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. వార్డు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉదయాన్నే వారి సమాచారం సేకరించారు. ఇంటి యాజమాని, ఇంట్లో సభ్యులు, వారి వయస్సు, ఏ సామాజిక వర్గానికి చెందిన వారనే విషయాలను నమోదు చేసుకుని అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఆయా వివరాలు పొందుపరిచి అప్‌డేట్ చేశారు. పట్టణంలోని తొమ్మిది, మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎంపీడీవో రెడ్డయ్య తెలిపారు.

● **చల్లపల్లి:** వివిధ సామాజిక వర్గాల జనాభాను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు సూచించారు. శుక్రవారం స్థానిక అగ్రహారంలో కుల గణన కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నానీ), పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి), పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



గూడూరు పటాన్ పేటలో కులగణన ప్రక్రియ ప్రారంభిస్తున్న దృశ్యం



చల్లపల్లిలో కులగణన ప్రారంభిస్తున్న ఎంపీడీఓ చిన రాట్నాలు

● **ఘంటసాల(అవనిగడ్డ):** మండల పరిధిలోని ఘంటసాలపాలెంలో శుక్రవారం కులగణన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అనూహ్య సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.అర్జునరావు, ఎంపీడీవో కార్యాలయ ఏవో కేజే శ్రీనివాస చంద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కీర్తి పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు స్వచ్ఛందంగా వెళ్లిన అభిమానులు



చిన్నాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నేతలు



పెడనలో వాహనాల వద్ద జెండా ఊపుతున్న ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ హారిక



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోనేరుసెంటర్: విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ప్రపంచ మేధావి, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శుక్రవారం బందరు నుంచి స్వచ్ఛందంగా అభిమానులు భారీగా తరలివెళ్లారు. బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని). ఆయన తనయుడు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు విజ్ఞప్తితో ప్రజలు పయనమయ్యారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని అన్ని డివిజన్ల నుంచి దళితులు, అభిమానులు స్వచ్ఛందంగా ఎమ్మెల్యే పేర్ని నాని, నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కిట్టు ఆధ్వర్యాన తరలి వెళ్లారు.

పెడన: అంబేడ్కర్ ఆశయాలతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం అందిస్తున్నారని పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గం నుంచి అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. అనంతరం గూడూరు మండలంలోని మద్దిరావమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం స్మృతివనానికి బయల్దేరి వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండవీటి నాగబాబు, బండారు మల్లి, ఎండీ ఖాజా, గరికిపాటి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రం గూడూరుతో పాటు తరకటూరు, మల్లవోలు, ఆకుమర్రు, కలపటం, కంకటావ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు విజయవాడకు పయనమయ్యారు.

కోడూరు: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు కోడూరు నుంచి ప్రజలు, పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ గుర్రం బసవయ్య వెళ్లారు.

నాగాయలంక: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి శుక్రవారం నాగాయలంక మండలం నుంచి ఎస్సీ, ఎస్టీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. తొలుత స్థానిక పార్కు సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి బస్సుల ర్యాలీని ప్రారంభించారు. ఏపీఎం కె.వై దాసు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మోపిదేవివార్పు(మోపిదేవి): అంబేడ్కర్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే కొనసాగిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. విజయవాడ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా తరలివెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అంబేడ్కర్ అభిమానుల వాహనాలను శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి మోపిదేవి వార్పు వద్ద దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరావు, పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జై భీమ్ అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

పెడన: యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం పెడన పురపాలక సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ టి.ఏసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. వేమన శతకాలు నేటి తరానికే కాకుండా భావితరాలకు కూడా మార్గదర్శకం చేసేలా రచనలున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు

మండవల్లి: ప్రకృతి వ్యవసాయ సాగుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని మాస్టర్ ట్రైనర్ కాంతమ్మ తెలిపారు. మండలంలోని కొర్లపాడులో వాడరేవుల నాగవాణి సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఫీల్డ్ ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కాంతమ్మ శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జిలు నాగ విజయ, గౌతమ్‌కుమార్, ఐసీఆర్పీ నాగవాణి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మేమున్నామంటూ.. పూర్వ విద్యార్థుల భరోసా

స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక చేయూత



బొర్రపోతు పాలెంలోని నాగమల్లీశ్వరికి ఆర్థిక సాయం చేస్తున్న 1993-94 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

పెడన: మేమున్నామంటూ చిన్ననాటి స్నేహితుల కుటుంబాలకు పూర్వ విద్యార్థులు భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని భట్ట జ్ఞాన కోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో 1993–94 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు. వీరిలో ఇద్దరు మరణించడంతో ఆ రెండు కుటుంబాలకు పూర్వ విద్యార్థులు రూ.15వేలు చొప్పున శనివారం ఆర్థిక చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఇర్ఫాన్ పాషా మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 14న 30 సంవత్సరాల తరువాత అదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగిందన్నారు. విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. ఈ బ్యాచ్‌లోని కొందరు మిత్రులు దురదృష్టవశాత్తు చనిపోవడంతో వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా భరోసా ఇస్తూ అండగా నిలిచినట్లు పేర్కొన్నారు. తమతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థిని బందరు మండలం బొర్రపోతు పాలెంకు చెందిన నాగమల్లీశ్వరి భర్త మాగంటి రామకృష్ణ చనిపోవడంతో ఆమెకు రూ.15వేలు, గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన నున్న ఉమా నాగేంద్రం మృతి చెందడంతో అతని భార్య సుజాతకు రూ.15వేలు ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో మధుసూదనరావు, మెట్ల గోపి, చాంద్ బాషా, విశ్వం, ఇస్మాయిల్, ప్రసాద్, లావణ్య, బాసిద్, బి.కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

పెనమలూరు: తాడిగడప గ్రామంలో ఇంటి బయట పార్కింగ్ చేసిన బైక్ చోరీ జరగటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప చెరువు సమీపంలో మాధవరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతను ప్రైవేటు ఎలక్ట్రీషియన్. అతను గత నెల 10వ తేదీన పనులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వచ్చి వాహనాన్ని బయట నిలిపాడు. అతను ఉదయం లేచి చూడగా బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బైక్ కోసం అనేక ప్రాంతాలు వెదికినా దొరకక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

11 ఎకరాల చెరకు తోట దగ్ధం

తోట్లవల్లూరు: విద్యుత్ తీగ తెగిపడటంతో చెరకుతోట దగ్ధమైన ఘటన మండలంలోని యాకమూరులో జరిగింది. గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గాదె భగవాన్‌రెడ్డికి చెందిన తొమ్మిది ఎకరాల చెరకుతోట, బండి రాజ్యలక్ష్మికి చెందిన రెండు ఎకరాల చెరకుతోట శుక్రవారం సాయంత్రం దగ్ధమైంది. విద్యుత్‌తీగ తెగిపడిన కారణంగానే చెరకు తోట దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. ఉయ్యూరు ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ. 1.80 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు ఫైర్ సిబ్బంది పేర్కొన్నారు.

ముగిసిన పేరంటాలమ్మ ఉత్సవాలు

రామవరప్పాడు: రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. గత 6 రోజులుగా రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రసాదంపాడులో రథోత్సవం ముగింపు అనంతరం ఆలయం ఎదుట అమ్మవారి విగ్రహాలు చేరుకున్నాయి. గ్రామంలో నూతన వంతెన సమీపంలోని రైవస్ కాలువలో హంస ఆకారంలో ప్రత్యేకంగా అలంకరించిన పడవలో అమ్మవార్లను ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. దీన్ని తిలకించడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయం సమీపంలోని రావిచెట్టు ఎదుట ఇరు గ్రామ పెద్దలు, భక్తులు కలిసి రకరకాల పుష్పాలతో అలంకరించిన ఊయలలో అమ్మవార్లను ఉంచి పూలంకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ముగ్గురమ్మలను ఆలయంలోనికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఈవో పాతూరి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్‌లు మాట్లాడుతూ ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామ పెద్దలకు, పోలీసులు, ఆరోగ్య, గ్రామ పంచాయతీ సిబ్బందికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో భారీ అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాగా చదివి కళాశాలకు పేరు తేవాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న రాధాకృష్ణమూర్తి తదితరులు

పెడన: విద్యార్థులు బాగా చదువుకుని కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఉన్నత విద్య విశ్రాంత డీవైఈవో మట్టా రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఉచిత మధ్యాహ్న భోజన పథకానికి శుక్రవారం భోజనానికి అయ్యే ఖర్చు రూ.5వేలను కళాశాల లైబ్రేరియన్, సైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవికి రాధాకృష్ణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో రోజూ ఉచితంగా భోజనం పెట్టాలని ఆలోచన నాగరవికి రావడమే చాలా గొప్ప విషయమని అభినందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య బాగా పెరగాల్సి ఉందన్నారు. పాఠాలను శ్రద్ధగా విని అర్థం కాకపోతే అడిగి తెలుసుకుని విద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, నిరంజన్, గంగాధర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వనవలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



వనవలమ్మకు పూజలు నిర్వహిస్తున్న దంపతులు

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని నిజాంపేటలో వేంచేసియున్న విజయ వనవలమ్మ 107వ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు డెప్యూటీ మేయర్ శీలం భారతి, బాబ్జీ దంపతులు, విన్నకోట వనప్రభాకర్, శైలజ దంపతులు, మిరియాల రామకృష్ణ, అమ్మాజీ దంపతులు, పొన్నూరు శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి దంపతులు, నరహరిశెట్టి కనకదుర్గ ప్రసాద్, విజయలక్ష్మి దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుహాసినీలతో లలితా పారాయణం చేశారు. అమ్మవారి చీరల ప్రసాదాన్ని దంపతులకు అందజేశారు. కమిటీ సభ్యులు వనప్రభాకర్ మాట్లాడుతూ కొండరాతి స్తంభాలతో దేవాలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఏటా సంక్రాంతి తర్వాత ఆదివారం జాతర మహోత్సవాలు నిర్వహిస్తామని భక్తులు మొక్కుబడులు చెల్లించుకోవాలని కోరారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా



నందమూరు వాసవి ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో కబడ్డీ పోటీలు



వాలీబాల్ మ్యాచ్ దృశ్యం



నాగాయలంకలో క్రికెట్ ఫైనల్ విజేతగా నిలిచిన శ్రీగణేశ్ టీమ్ జట్టు గ్రామీణ క్రీడాకారులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రీడలను ప్రోత్సహించడానికి నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రాలో భాగంగా శుక్రవారం నగరంలో పలు ఆటల పోటీలు నిర్వహించారు. నగరంలోని నోబుల్ కళాశాల, ఆంధ్ర జాతీయ కళాశాల క్రీడామైదానాల్లో క్రికెట్ పోటీలు జరిగాయి. ఎనిమిది క్రికెట్ మ్యాచ్‌లు, రెండు వాలీబాల్, పురుషుల కబడ్డీ ఐదు, మహిళల ఖోఖో ఐదు, మహిళల బ్యాడ్మింటన్ 44 మ్యాచ్‌లు నిర్వహించారు. పోటీలను చిలకలపూడి పాండురంగ ప్రభుత్వ పాఠశాల పీఈటీ రమేష్‌కుమార్ పర్యవేక్షించారు.

హోరాహోరీగా మండల స్థాయి పోటీలు

పెడన: ఆడుదాం ఆంధ్రలో భాగంగా వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో గెలుపొందిన జట్లకు రెండు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి ఫైనల్స్‌లో పలు జట్లు తలపడుతున్నాయి. వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కబడీ పోటీల్లో నాలుగు టీంలు తలపడగా ఫైనల్స్‌లో నందమూరు, పెడన పట్టణానికి చెందిన కన్న బాగరీస్ టీంలు తలపడగా నందమూరు టీం మండల స్థాయి విజేతగా నిలిచింది. బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో జరిగిన పురుషుల విభాగం ఆగస్తేశ్వరపురం, మహిళా విభాగంలో బంటుమిల్లి రోడ్డు సచివాలయం టీంలు మండల స్థాయికి ఎంపికయ్యాయి. క్రికెట్, వాలీబాల్, ఖోఖో జట్లు తలపడుతున్నాయి. క్రికెట్ మ్యాచ్‌లో బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, వాలీబాల్, ఖోఖో టీంలు పల్లోటి ఉన్నత పాఠశాలలో పోటీ పడుతున్నట్లు ఎంపీడీవో రెడ్డయ్య తెలిపారు.

నాగాయలంక: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం విజయవంతంగా ముగిశాయి. మూడు రోజులుగా 21 క్రికెట్ జట్ల మధ్య జోరుగా పోటీలు సాగాయి. ఫైనల్‌లో నాగాయలంక–1 సచివాలయం పరిధిలో ఆడిన శ్రీగణేష్ టీమ్ సంగమేశ్వరం జట్టుపై విజయం సాధించింది. గెలిచిన జట్టు అవనిగడ్డ నియోజకవర్గం స్థాయిలో ఆడుతుంది. కబడ్డీలో తలగడదీవి జట్టు, ఖోఖో–వాలీబాల్ క్రీడల్లో ఏటిమొగ జట్లు, షటిల్ బాడ్మింటన్‌లో నాచుగుంట జట్టు ఫైనల్ విజేతలుగా నిలిచారు. విజేతలు నియోజకవర్గం స్థాయిలో మిగతా అయిదు మండలాల క్రీడాకారులతో తలపడతారని ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ చెప్పారు.

సానుకూల నిర్ణయం తీసుకోవాలి

గన్నవరం: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఇంటలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిగాస్ రాష్ట్ర అధ్యక్షుడు మట్టా విద్యార్థి శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్ గౌబా నేతృత్వంలోని కమిటీ మాదిగలు, మాదిగ ఉపకులాల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. తద్వారా రానున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్రానికి విన్నవించారు.